హెల్త్ కిట్లు లేనట్టేనా?

- పాఠశాలలో 2021నుంచి నిలిచిన కిట్ల పంపిణీ
- బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ చూపని ప్రభుత్వం


మర్రిగూడ జెడ్పీ ఉన్నత పాఠశాల

మర్రిగూడ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నభ్యసించే బాలికల ఆరోగ్య పరిరక్షణకు గత ప్రభుత్వం 2018–19సంవత్సరంలో బాలికా ఆరోగ్య రక్ష పథకం కింద పరిశుభ్రత కిట్ల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. విద్యార్థినులకు మూడు నెలల కొకసారి, సంవత్సరంలో నాలుగుసార్లు అందించే ఆరోగ్య కిట్లు నాలుగేళ్లుగా పంపిణీకి నోచుకోకపోవడంతో ప్రభుత్వం బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ చూపడంలేదని అర్థమవుతుంది. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే 8, 9, 10వ తరగతితో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థినులకు 15రకాల వస్తువులతో కూడిన హెల్త్‌కిట్లు పంపిణీ చేయాలని రూపకల్పన చేసింది. ఈ కిట్ల పంపిణీ ఏడాది, ఏడాదిన్నర కాలంపాటు సజావుగానే సాగింది. ఈ సమయంలో కరోనా విజృంభించడంతో పాఠశాలలు సెలవులు ప్రకటించగా పంపిణీ పూర్తిగా నిలిచిపోయింది. అప్పటి నుంచి నేటికీ ఆ కిట్ల పంపిణీ పునఃప్రారంభం కాకపోవడంతో పాఠశాలలో విద్యనభ్యసించే నిరుపేద విద్యార్థినులు కిట్లు అందిస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుందని భావిస్తున్నారు. మర్రిగూడ మండల వ్యాప్తంగా 8, 9, 10వ తరగతులు చదివే విద్యార్థినుల సంఖ్య ఆదర్శ పాఠశాలలో, ఇంటర్మీడియట్ 170, 8నుంచి 10వ తరగతి విద్యార్థులు 102, దామెరబీమనపల్లిలో 25, ఖుదాభక్షపల్లిలో 27, మర్రిగూడలో 35, శివన్నగూడలో 24, యరగండ్లపల్లిలో 25, మండలంలో మొత్తం 408మంది బాలికలు 2024–25సంవత్సరంలో విద్యనభ్యసిస్తున్నారు.

15రకాల వస్తువులతో హెల్త్‌కిట్టు..

బాలికలకు అందించే ఒక్కొక్క ఆరోగ్య కిట్‌లో 15రకాల వస్తువులు ఉంటాయి. శానిటరీ, న్యాప్‌కిన్స్, స్నానపు సబ్బులు, బట్టల సబ్బులు, షాంపులు, బొట్టుబిల్లలు, కొబ్బరినూనె, దువ్వెన, పౌడర్, టూత్‌బ్రష్, టూత్‌పేస్ట్, టంగ్ క్లీనర్, రబ్బర్ బ్యాండ్, రిబ్బన్లు తదితర వస్తువులు ఉంటాయి. ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉన్న కుటుంబాల నుంచి ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విద్యార్థినులకు ఈ హెల్త్‌కిట్లు ఎంతగానో ఉపయోగపడతాయి.

2018 ఆగస్టు 24న ప్రారంభమైన పథకం..

ఈ విద్యా సంవత్సరం పాఠశాలలు ప్రారంభమై ఆరు నెలలు గడిచినా ఇప్పటివరకు ఆరోగ్య కిట్ల జాడలేదు. బాలికల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా 2018 ఆగస్టు 24న గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. అప్పటి నుంచి ఈ పథకానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ప్రభుత్వ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలో విద్యనభ్యసించే 12ఏళ్ల నుంచి 18ఏళ్ల వయస్సు కలిగిన విద్యార్థినులకు ఉచితంగా అందించారు. కరోనా నుంచి నేటికి ఆరోగ్య కిట్ల విషయంలో గందరగోళం నెలకొని పంపిణీకి నోచుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం స్పందించి ఈ పథకాన్ని పునఃప్రారంభించి బాలికల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని విద్యార్థినులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

హెల్త్‌కిట్లు అందిస్తే బాగుండు

హెల్త్ కిట్లు పంపిణీ చేస్తే మాకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలలో చదివే బాలికల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలి. ప్రస్తుత ప్రభుత్వం కిట్లను పంపిణీ చేస్తే బాగుంటుంది.
– స్పందన, పదోతరగతి విద్యార్థిని, మర్రిగూడ

ప్రభుత్వం ఆదేశాల మేరకు పంపిణీ చేస్తాం

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులకు అందించే ఆరోగ్య కిట్ల పంపిణీ విషయంలో ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ప్రతిపాదన లేదు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థినులకు కిట్లను పంపిణీ చేస్తాం.
– బిట్టు శ్రీనివాస్, ఎంఈఓ

క్లుప్తంగా

కోదండరామ్‌ను కలిసిన టీఎన్‌జీవో నాయకులు


కోదండరామ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీఎన్‌జీవో నాయకులు

నల్లగొండ : పట్టణంలో నిర్వహించిన తెలంగాణ జన సమితి (టీజేఎస్) పార్టీ సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండ రామ్‌ను శనివారం నల్లగొండ జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ట్రెజరర్ డా. కె.సందీప్, అసోసియేట్ ప్రెసిడెంట్ అమరేందర్‌గౌడ్, వైస్‌ప్రెసిడెంట్ పర్వేజ్ అతహర్, ప్రచార కార్యదర్శి మహ్మద్ అనీఫ్ తదితరులు ఉన్నారు.

పోస్టల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలి


పోస్టల్ బీమాకు నమోదు చేయించుకుంటున్న గ్రామస్తులు

చిట్యాల : పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న ప్రమాద బీమా సౌకర్యాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చిట్యాల ఏఎంసీ మాజీ చైర్మన్, పెద్దకాపర్తి గ్రామ ముత్యాలమ్మ ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడు కాటం వెంకటేశం కోరారు. శనివారం మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలోని ముత్యాలమ్మ ట్రాక్టర్ యూనియన్‌కు చెందిన వంద మంది సభ్యులకు పోస్టల్ శాఖ రూ.750తో అందిస్తున్న రూ.15లక్షల ప్రమాద బీమా పత్రాలను ఆయన అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో గంట్ల రవీందర్‌రెడ్డి, జక్కలి మల్లేష్, బాలమల్లు పాల్గొన్నారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా వెంకటేశ్వర్లు



నకిరేకల్ : నకిరేకల్‌లో సీపీఎం పట్టణ మహాసభను శుక్రవారం నిర్వహించారు. ఈ సభలో పట్టణానికి చెందిన వంటిపాక వెంకటేశ్వర్లును పార్టీ పట్టణ కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు శనివారం ఆయన తెలిపారు. సభ్యులుగా సాకుంట్ల నర్సింహ, బహురోజు ఇందిరా, వంటిపాక కృష్ణ, చిన్నబోయిన నాగమణి, తడిసిన శ్రీనివాస్‌రెడ్డి, ఏర్పుల తాజేశ్వర్, గింజల లక్ష్మి, పాల్వాయి నర్సింహ, బాతుక సైదులు, గురుజ స్వరూప, ఆదిమళ్ల ప్రవీణ్ ఎన్నికైనట్లు వెల్లడించారు.

వ్యవసాయశాఖ మంత్రికి నాయకుల వినతి


మంత్రిని సన్మానిస్తున్న బత్తుల ఉషయ్య

నార్కట్‌పల్లి : వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, నాయకుడు వడ్డే భూపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు జేరిపోతుల భరత్ చిట్యాలలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు మండలంలోని వ్యవసాయ సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయనను సన్మానించారు. మండలానికి ప్రత్యేకంగా మార్కెట్‌యార్డ్ చేయాలని కోరినట్లు వారు వెల్లడించారు.

మధ్యాహ్న భోజనానికి అధిక నిధులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనానికి నిధులు పెంచాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు అన్నారు. శనివారం పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టల్లో గురుకులాల్లో కస్తూరిబా గాంధీ బాలికల విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి నిధులు కేటాయించిందని, ఎస్ఎఫ్ఐ అనేక పోరాటాల ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చి సంక్షేమ గృహ విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచిందన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, కంభంపాటి శంకర్, కుర్ర సైదానాయక్, బుడిగ వెంకటేష్, కోరే రమేష్, ముస్కు రవీందర్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీశైలం

నల్లగొండ టౌన్ : రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెల్లా శ్రీశైలం అన్నారు. శనివారం పట్టణంలోని పెన్షనర్ల భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్సీ అమలు విషయంలో ప్రభుత్వం త్వరగా పరిష్కరించాలన్నారు. అనంతరం వంద మంది పెన్షనర్లను వారి జన్మదినం సందర్భంగా సన్మానించి కానుకలు అందజేశారు. కార్యక్రమంలో గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్, జి.సుధాకర్, ఎం.శేషారెడ్డి, రఘునాథం, ఎం.కేశవాచారి, జెల్లా పుల్లయ్య, టి.రమేష్, ఎస్.రవిప్రసాద్‌రావు, ఎన్.రంగయ్య, ఎస్.ఆంజనేయులు, బి.మోహన్‌రావు, ఎం.వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహమ్మద్ ఇక్బాల్ జయంతి


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : ముహమ్మద్ ఇక్బాల్ 147వ జయంతి సందర్భంగా ప్రపంచ ఉర్దూ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఖవాజా ఘౌస్ మొహియుద్దీన్ హషీమ్ అన్నారు. శనివారం పట్టణంలో ఏఏ ఖాన్ అధ్యక్షతన జరిగిన ఉర్దూ దినోత్సవంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్ పాల్గొని ఇక్బాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ఇక్బాల్‌ను ప్రజలు మరువలేరన్నారు. కార్యక్రమంలో ఖవాజా మొహితుల్లా, ఫలాహ్ మిల్లత్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ఖవాజా ఘౌస్ మొహియుద్దీన్ హాషిమ్, సహాయ అధ్యక్షుడు ముహమ్మద్ నసీరుద్దీన్, ఉపాధ్యక్షులు ముహమ్మద్ ఇబ్రహీం, మహ్మద్ షరీఫ్, ముహమ్మద్ అలీముద్దీన్, మూసాఖాన్, ముజ్తబ జలాల్, సయ్యద్ గౌసుద్దీన్, మౌలానా జమాల్, జునైద్ హష్మీ, ఎం.ఎ.జలీల్, జమీర్‌అహ్మద్, బుర్హాన్ షరీఫ్, ముహమ్మద్ ముజమ్మిల్, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే సైదులుగౌడ్ రిమాండ్


తిప్పర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

తిప్పర్తి : రాజకీయ కక్షతోనే బీసీ నాయకుడైన మాజీ జెడ్పీటీసీ తండు సైదులుగౌడ్‌ను రిమాండ్‌కు తరలించారని బీసీ సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ, ఎస్సీ, మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌గౌడ్, గౌడ సంఘం జిల్లా నాయకులు తండు నర్సింహగౌడ్ మాట్లాడారు. ఒక పేషీకి హాజరుకాలేదనే సాకుతో సైదులుగౌడ్‌ను రిమాండ్ విధించడం సరికాదన్నారు. రాజకీయంగా ఆయనను ఎదుర్కొలేక అధికార పార్టీ నాయకులు కుట్రపన్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సాకుతో ముందస్తు అరెస్టు చేసి అక్కడి నుంచి రిమాండ్ తరలించడం దారుణమన్నారు. పాతకేసులో రిమాండ్ చేయడం రాజకీయమే అన్నారు. వెంటనే ఆయనకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం టౌన్ అధ్యక్షుడు నాగేందర్, అశోక్, నాయకులు కందుల లక్ష్మయ్య, వనపర్తి నాగేశ్వర్‌రావు, బైరగోని శ్రీనివాస్, గుండు వెంకన్న, జూకటి బాలరాజు, జూకటి ఆనంద్, గుండు రవి, కాసాని సత్తయ్య, పోలగోని శ్రీనివాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభల కరపత్రాల విడుదల


నల్లగొండ టౌన్: కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

నల్లగొండ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలో డిసెంబర్ 2, 3, 4తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీమ్, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య అన్నారు. శనివారం పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పారిశ్రామిక రంగాన్ని, వ్యవసాయ రంగాన్ని దివాలా తీయించాయన్నారు. విద్య, వైద్యం సామాన్యులకు అందని ద్రాక్షలా మారాయన్నారు. డిసెంబర్ 2న మిర్యాలగూడ పట్టణంలో భారీ బహిరంగ సభ, 3, 4తేదీల్లో ప్రతినిధుల సభ ఉంటుందని తెలిపారు. మహాసభలకు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కమిటీ సభ్యులు గాదె నరసింహ, పాక లింగయ్య, గంజి నాగరాజు, గుండాల నరేష్, బుచ్చిరాములు, యోగానందం, భద్రయ్య, ఆంజనేయులు, గిరిబాబు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

చండూరు (గట్టుప్పల్) : మిర్యాలగూడ పట్టణంలో డిసెంబర్ 2 ,3, 4తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బొట్ట శివకుమార్ పిలుపునిచ్చారు. శనివారం మండలం పరిధిలోని తేరట్‌పల్లి గ్రామంలో ఆయన మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఆచ్చిన శ్రీనివాసులు, వల్లూరి శ్రీశైలం, బిజిలి రాములు, గిరి భిక్షం, గిరి వెంకటేష్, పబ్బు లింగస్వామి, పబ్బు రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న కర్నాటి నరేష్

నకిరేకల్ : పట్టణానికి చెందిన లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధి కర్నాటి నరేష్ ఓ బాధిత కుటుంబానికి రూ.20,200 ఆర్థికసాయం అందజేసి మానవత్వం చాటుకున్నాడు. వివరాల ప్రకారం.. మిర్యాలగూడెం మండలంలోని ఉట్లపల్లి గ్రామానికి చెందిన పంతంగి సోమయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి చికిత్సకు సరిపడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని తెలుసుకుని ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధితుడి భార్యకు ఆర్థికసాయం అందజేశారు.

చిట్యాల : మండలంలోని వట్టిమర్తి గ్రామానికి చెందిన బెల్లపు ముఖేష్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతడికి వైద్య ఖర్చులకుగాను శివాజీ ఫౌండేషన్ సభ్యులు శనివారం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు సిరిపంగి నరేష్, సభ్యులు దామనూరి కృష్ణ, మెడబోయిన మల్లిఖార్జున్, రాచమల్ల రాము, సిరిపంగి యెట్టయ్య, సిరిపంగి హరికృష్ణ, పాలాల ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీలు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పోలీసులు రోడ్లపై తిరుగుతున్న వాహనాలతో పాటు వాహనదారులను పోలీస్ స్టేషన్‌కు తరలించిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. టూ టౌన్ సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ డీఎస్పీ కె.రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో పట్టణంలో ఐదు చోట్ల ఒకేసారి ఆకస్మిక తనిఖీలు చేపట్టగా అకారణంగా ఎలాంటి పని లేకుండా బైక్‌లపై యువకులు తిరుగుతుండటాన్ని గుర్తించామని 42మంది యువకులతో పాటు 32ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించి సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. అదుపులోకి తీసుకున్న 42మంది యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చామని మరొకసారి అర్ధరాత్రి ఎలాంటి కారణం లేకుండా రోడ్లపై తిరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ కరుణాకర్ తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అట్రాసిటి కేసుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

మిర్యాలగూడ టౌన్ : బీసీ వర్గాలకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ శనివారం నల్లగొండకు వచ్చిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంకు ఉద్యోగ సంఘాల నేతలు వినతి పత్రం అందజేశారు. వివిధ విభాగాల్లో పని చేస్తున్న బీసీ ఉద్యోగుల హక్కుల రక్షణ కల్పించాలని, రాష్ట్రంలో జరుగుతున్న జనగణనలో కులగణనను ఎటువంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా నిర్వహించే విధంగా చూడాలని కోరారు. బీసీ వర్గాలకు ఎస్సీ, ఎస్టీ మాదిరిగానే బీసీలకు పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పించాలని ఆ పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో విద్యుత్, గెజిటెడ్, బీసీ సంఘం ఉద్యోగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రయోజనాల కోసమే సమగ్ర కుటుంబ సర్వే

- ఎమ్మెల్యే మందుల సామేల్


శాలిగౌరారం : పెర్కకొండారంలో సర్వే నమోదు తీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్


నకిరేకల్ : ఎమ్మెల్యే వీరేశం నుంచి వివరాలను సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు

శాలిగౌరారం : రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే (ఎస్ఈఎస్) చేపట్టిందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని పెర్కకొండారం గ్రామంలో శనివారం సర్వేను ప్రారంభించి మాట్లాడారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేతో ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దన్నారు. సర్వేకు వెల్లడించిన ప్రతీ సమాచారాన్ని ప్రభుత్వం అత్యంత గోప్యంగా ఉంచుతుందన్నారు. సర్వేపై కొంత మంది ప్రజలకు కావాలనే అపోహలు కలిగిస్తున్నారని, అలాంటి అపోహలను నమ్మవద్దన్నారు. సర్వేతో ప్రధానంగా కుటుంబ జీవన వ్యవస్థ, ఉపాధి అవకాశాలు, జనాభా ప్రాతిపదికన అన్ని విభాగాలలో రిజర్వేషన్లను సరిచేసే అంశాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల వినియోగం, ఆర్థిక స్థితిగతులు, విద్య, ఉద్యోగ పరిస్థితులతో పాటు అనేక అంశాలపై సమాచారం ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఈనెల 18వరకు రాష్ట్ర వ్యాప్తంగా సర్వే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మాన్యానాయక్, తహసీల్దార్ యాదగిరి, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, సింగిల్‌విండో చైర్మన్ తాళ్లూరి మురళి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు పల్స సైదులు, మండల నాయకులు నూక సత్తయ్య, బండారు మల్లయ్య, తీర్పారి మల్లయ్య, చింత ధనుంజయ్య, గూని వెంకటయ్య, ననుబోతు అంజయ్య, జయరాజు, వెంకటేష్, కిశోర్, యుగంధర్‌రెడ్డి, పరమేశ్, బోడ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా ఉండాలి : డీఆర్‌డీఓ పీడీ

కేతేపల్లి : సమగ్ర కుటుంబ సర్వే పారదర్శకంగా ఉండాలని డీఆర్‌డీఓ పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. సర్వే సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోతే మరోసారి వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఎంపీఓ నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఎన్యుమరేటర్ సృజన తదితరులు ఉన్నారు.

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని అన్ని వార్డుల్లో మొదటి రోజు శనివారం ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి సమగ్ర కుటుంబ సర్వే చేపట్టారు. ఇంటి యజమానితో పాటు కుటుంబ సభ్యుల సమాచారాన్ని సేకరించారు. పట్టణంలోని 48వార్డుల్లో 310బ్లాక్‌లుగా విభజించి సర్వే నిర్వహించారు.

ప్రారంభమైన సర్వే వివరాల సేకరణ

మునుగోడు : ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలో భాగంగా శనివారం సర్వే సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాల సేకరణను ప్రారంభించారు. నిన్నటి వరకు కుటుంబాలను గుర్తించి స్టిక్కర్లు వేశారు. ఆ స్టిక్కర్ వేసిన ఇళ్లకు ఎన్యుమరేటర్లు వెళ్లి కుటుంబ యజమాని నుంచి వివరాలను సేకరించి నమోదు చేసుకున్నారు. ఈ సర్వేను ఎంపీడీఓ విజయభాస్కర్, తహసీల్దార్ ఎం.నరేందర్, ఆర్ఐలు రామచంద్రయ్య, నాగరాజు, ఇతర అధికారులు పర్యవేక్షించారు.

నకిరేకల్ : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సమగ్ర కుటుంబ సర్వే మున్సిపాలిటీతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ప్రారంభమైంది. ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించారు. పట్టణంలో ఎమ్మెల్యే వేముల వీరేశం నివాసంలో మున్సిపల్ కమిషనర్ బాలయ్యతో పాటు ఎన్యుమరేటర్లు వెళ్లి కుటుంబ వివరాలను సేకరించారు.

ప్రజా సంక్షేమం కోసమే సర్వే

కట్టంగూర్ : ప్రజా సంక్షేమం కోసమే ప్రభుత్వం సమగ్ర ఇంటింటి సర్వేను చేపట్టిందని తహసీల్దార్ గుగులోతు ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని అయిటిపాముల గ్రామంలో ఎన్యుమరేటర్లు చేపట్టిన ఇంటింటి సర్వేను ఆయన ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావుతో కలిసి పరిశీలించారు. సర్వేకు వస్తున్న ఎన్యుమరేటర్లకు ప్రజలు తమ కుటుంబ సభ్యుల వివరాలను అందించి సహకరించాలన్నారు. ఎన్యుమరేటర్లు పారదర్శకంగా సర్వేను నిర్వహించాలని సూచించారు.

సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

తిప్పర్తి : గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వేను ఎన్యుమరేటర్లు పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ స్వప్న అన్నారు. శనివారం మండలంలోని మామి డాల గ్రామంలో ఎంపీడీఓ వెంటేశ్వర్‌రెడ్డితో కలిసి సర్వేను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. మండలంలో మొత్తం 77మంది ఎన్యుమరేటర్లు, 8మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు వెల్లడించారు.


కేతేపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ పీడీ శేఖర్‌రెడ్డి


మునుగోడు : చొల్లేడులో వివరాలు సేకరించి నమోదు చేసుకుంటున్న ఎన్యుమరేటర్లు


కట్టంగూర్ : అయిటిపాములలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ గుగులోతు ప్రసాద్

వైభవంగా కంఠమహేశ్వరస్వామి బోనాలు


కంఠమహేశ్వరస్వామి ఆలయానికి గంపలు, బోనాలతో వెళ్తున్న భక్తులు

శాలిగౌరారం : మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కంఠమహేశ్వరస్వామి కల్యాణోత్సవాలు శనివారం రెండో రోజు అత్యంత ఘనంగా జరిగాయి. ఉత్సవాలలో భాగంగా స్వామివారికి గంపలు, బోనాలు సమర్పించే కార్యక్రమం రాత్రి వైభవంగా చేపట్టారు. కంఠమహేశ్వరస్వామి బోనాల సమర్పణ సందర్భంగా మండల కేంద్రంతో పాటు మార్కెట్ కాలనీ, బాలిశెట్టిగూడెం, పావురాలగూడెంలలో సందడి నెలకొంది. ఉత్సవాలలో గౌడ కులపెద్దలు, ఉత్సవ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలలో వైద్యశిబిరం



విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

నల్లగొండ టౌన్ : పట్టణంలోని ప్రేరణ కాన్సెప్ట్ స్కూల్‌లో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో చర్మవ్యాధి నిపుణుడు డాక్టర్ మనోజ్‌కుమార్, డాక్టర్ అనిల్‌కుమార్ పాల్గొని విద్యార్థులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఏమిరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'సీసీఐ'కి పత్తిని ఆరబెట్టుకొని తీసుకురావాలి

శాలిగౌరారం : మండలంలోని మాధారంకలాన్ గ్రామం వద్ద గల కాటన్‌మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రానికి పత్తిని రైతులు 8నుంచి 12శాతం తేమ ఉండేటట్లు ఆరబెట్టుకొని తీసుకురావాలని శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి చీనానాయక్ అన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు మంచు సమయంలో పత్తిని తీయడంతో తేమశాతం అత్యధికంగా ఉంటుందన్నారు. తేమశాతం పెరగడంతో పత్తి కొనుగోలుకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందన్నారు. రైతులు సీసీఐ నిబంధనలకు లోబడి పత్తిని విక్రయించాలన్నారు.

కరపత్రాల విడుదల


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నకిరేకల్ : పట్టణంలోని జెడ్పీ పాఠశాలలో ఆదివారం సాయంత్రం 5గంటలకు మానవ హక్కుల వేదిక జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర బాధ్యుడు మోహన్ తెలిపారు. శనివారం స్థానికంగా మహాసభలకు సంబంధించిన ప్రచార కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఈ మహాసభలో దేశంలో, రాష్ట్రంలో ప్రజల స్థితిగతులు, రాజకీయ పార్టీలు, పర్యావరణ పరిస్థితులు తదితర అంశాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. ఈ సభలకు ప్రజలందరూ హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చింతమల్ల గురూజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కెనపల్లి వీరస్వామి, అద్దంకి దశరథ, ప్రసాద్ శెట్టిపల్లి కాశీరాం తదితరులు పాల్గొన్నారు.

మలబార్ గోల్డ్‌లో నెక్లెస్ మేళా

మిర్యాలగూడ : పట్టణంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ దుకాణంలో శనివారం నెక్లెస్ మేళాను ప్రముఖ గైనకాలజీ వైద్యురాలు సింధు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల అభిరుచికి తగిన విధంగా ఆభరణాలను రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో సంపత్, మహమ్మద్ తౌఫిక్, ప్రవళిక, శ్వేతా ఉన్నారు.